సాక్షి
మంచిర్యాల
శనివారం । 10 । ఆగస్టు । 2024



భక్తి శ్రద్ధలతో నాగుల పంచమి

జిల్లాలో శుక్రవారం నాగుల పంచమి వేడుకలను మహిళలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని పుట్టల్లో పాలు పోసి పూజలు చేశారు. 9లో▸

ఎస్సైల బదిలీ

మంచిర్యాలక్రైం: కమిషనరేట్ పరిధిలో ఎస్సైలను బదిలీ చేస్తూ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్‌లో ఉన్న ఎన్.సామ్యేల్‌ను సీసీఎస్ మంచిర్యాలకు, ఎన్.శ్రీనివాస్‌ను మహిళా స్టేషన్‌కు, పి.రాజయ్యను లక్సెట్టిపేటకు, ఎన్.శ్రీనివాస్‌ను మందమర్రికి, అక్బర్ పాషను రామకృష్ణాపూర్‌కు, ఎస్.రాములును మంచిర్యాల ట్రాఫిక్‌కు, వీ.హైమ పీ టీమ్‌కు, ముత్తారం ఎస్సైని సీసీఎస్‌కు బదిలీ చేశారు.

గరిష్టం/కనిష్టం
33.0 /26.0

వాతావరణం

ఉదయం వేళ ఆకాశం మేఘావృతమై ఉంటుంది. రాత్రి వేళ చిరుజల్లులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. వాయువ్యం దిశగా ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఎస్టీపీపీ జీఎంకు ఈడీగా అదనపు బాధ్యతలు



ఈడీగా బాధ్యతలు స్వీకరిస్తున్న రాజశేఖర్‌రావు

జైపూర్: జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు జీఎం(ఈఅండ్‌ఎం)గా బాధ్యతలు స్వీకరించిన ఎన్.వీ.రాజశేఖర్‌రావుకు ఈడీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో శుక్రవారం ఆయన ఎస్టీపీపీ ఈడీగా బాధ్యతలు చేపట్టారు. పర్సనల్ మేనేజర్‌గా పని చేసిన రామశాస్త్రి ఇటీవల పదవీ విరమణ పొందగా ఆయన స్థానంలో బదిలీపై వచ్చిన డీజీఎం(పర్సనల్) అజ్మీర తుకారం బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు ఎస్టీపీపీలో అమ్మ పేరున ఒక్క మొక్కనాటుదాం అనే కార్యక్రమంలో భాగంగా అధికారులతో కలిసి ఆయన మొక్కలు నాటారు.

అవయవదానం.. ఏడుగురికి ప్రాణదానం



శ్రీకాంత్(ఫైల్)

జైపూర్: తాను మరణిస్తూ ఏడుగురి వ్యక్తుల జీవితాల్లో వెలుగు నింపాడు ఆ యువకుడు. రోడ్డు ప్రమాదంలో గాయపడి బ్రెయిన్ డెడ్ కాగా అవయవాలను దానం చేసి ప్రాణం పోశాడు. మండలంలోని షెట్‌పల్లి గ్రామానికి చెందిన రేవెల్లి శ్రీకాంత్ మంచిర్యాలలోని ప్రైవేటు ఆస్పత్రిలో ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్‌గా చేస్తుండేవాడు. ఈ నెల 6న షెట్‌పల్లి నుంచి మంచిర్యాలకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా టేకుమట్ల వద్ద ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో మంచిర్యాలలోని ఆస్పత్రిలో చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆస్పత్రికి తరలించారు. శనివారం శ్రీకాంత్(35)కు బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు తెలిపారు. జీవన్‌దాన్ అవయవ మార్పిడి కేంద్రం ద్వారా శ్రీకాంత్ రెండు కిడ్నీలు, లివర్, గుండె, రెండు కళ్లు, ఊపిరితిత్తులు దానం చేశారు. అవయవాలు ఏడుగురికి అమర్చారు. శ్రీకాంత్‌కు భార్య స్వప్న, కుమారుడు ఉన్నారు.

తిరంగ ర్యాలీ విజయవంతం చేయాలి

మంచిర్యాలటౌన్: ఈ నెల 14న మంచిర్యాలలో నిర్వహించే భారీ తిరంగ ర్యాలీని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి కోరారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ర్యాలీలో పట్టణ పుర ప్రముఖులు, విద్యావంతులు, మేధావులు, యువకులు, విద్యార్థులు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు వెంకటేశ్వర్‌రావు, రంగ శ్రీశైలం, రాకేశ్ రెన్వా, రెడ్డిమల్ల అశోక్, అమిరిశెట్టి రాజు, బింగి ప్రవీణ్, కంకణాల సతీశ్ పాల్గొన్నారు.

సర్వేశాఖలో ప్రైవేటు సేవ



- పలు చోట్ల ప్రైవేటు సర్వే లైసెన్స్‌దారులే..
- తాజాగా రెగ్యులర్ సర్వేయర్లకు స్థానచలనం
- తమనూ కొనసాగించాలంటూ మంత్రాంగం
- ఏళ్లుగా జీతం రాకున్నా విధుల నిర్వహణ

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: భూముల కొలతలు, రికార్డులు చేపట్టే అధికారుల కొరతతో ప్రైవేటు లైసెన్స్‌దారులతోనే నెట్టుకు రావాల్సి వస్తోంది. జిల్లాలో సరిపడా రెగ్యులర్ సర్వేయర్లు లేక ప్రైవేటు వ్యక్తుల తాత్కాలిక నియామకం జరిగింది. గత సర్కారు ఆదేశాలతో 2017 నుంచే లైసెన్స్ కలిగిన వారిని ఆయా మండలాల్లో నియమించారు. గత ఏడేళ్లలో చాలా జిల్లాల్లో ప్రైవేటు వ్యక్తుల సేవలు నిలిచిపోయాయి. కొన్ని చోట్ల ఇంకా కొనసాగుతున్నాయి. మొదటి ఏడాది వేతనం ఇచ్చినప్పటికీ ఆ తర్వాత ఎవరికీ చెల్లింపులు లేవు. అయినప్పటికీ అలాగే కొనసాగుతున్నారు. జిల్లాలో 18 రెవెన్యూ మండలాలు ఉన్నాయి. వీటి పరిధిలో తొమ్మిది మంది రెగ్యులర్ ఉండగా, మరో ఇద్దరు ఐకేపీ నుంచి, మరో ఆరుగురు ప్రైవేటు సర్వేయర్లు ఉన్నారు. ఇటీవల సాధారణ బదిలీల్లో భాగంగా ఆయా మండలాల్లో పని చేస్తున్న సర్వేయర్లు బదిలీపై వెళ్లగా, వారి స్థానాల్లో కొత్తవారు వచ్చారు. ఇంకా వారికి పోస్టింగ్‌ల్లో మండలాల కేటాయింపు చేయలేదు. జిల్లా ఉన్నతాధికారి అసిస్టెంట్ డైరెక్టర్(ఏడీ) ఎం.శ్రీనివాస్ బదిలీపై వెళ్లగా, ఆయన స్థానంలో జిల్లా ఏడీగా వి.శ్రీనివాస్ విధుల్లో చేరారు.

జీతం లేకున్నా విధులు

రెగ్యులర్ ఉద్యోగులు బదిలీపై వచ్చినప్పటికీ ఖాళీగా ఉన్న చోట తమను కూడా కొనసాగించాలని లైసెన్స్‌దారులు కోరుతున్నారు. ఆ శాఖ ఉన్నతాధికారులతోనే తమను ఆయా మండలాల్లో కొనసాగించాలని పేర్కొంటున్నారు. అయితే ప్రైవేటు సర్వేయర్ల కొనసాగింపు, రద్దుపై ఇంకా స్పష్టత లేదు. భూ క్రయ విక్రయాలు, కొలతలు, రికార్డులు, రిపోర్టుల్లో సర్వేయర్ల పాత్ర కీలకంగా ఉంటుంది. సింగరేణి కంపెనీతోపాటు జాతీయ రహదారులు, సాగునీటి ప్రాజెక్టులు, ఇతరత్రా సర్వే రిపోర్టు ఆధారంగానే బాధితులకు పరిహారం చెల్లింపులు ఉంటాయి. జిల్లాలో నిరంతరం ఈ ప్రక్రియ కొనసాగుతూ ఉంటుంది. ఈ క్రమంలో ఆయా మండలాల్లో గత కొంతకాలంగా కొన్ని చోట్ల ప్రైవేటు సర్వేయర్లు ఉన్నతాధికారుల అండతో కొందరు తెర వెనుక పనులు చక్కబెడుతున్నారనే ఆరోపణలున్నాయి. నెలవారీగా జీతాల చెల్లింపులు లేనప్పటికీ దరఖాస్తుదారుల నుంచే నేరుగా డబ్బులు తీసుకుంటూ ఆయా మండలాల్లో పని చేసేందుకు ఆసక్తి చూపిస్తుండడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

కీలకంగా సేవలు

సర్వేయర్లు రెవెన్యూ శాఖలో కీలకం కావడంతో వీరి నియామకంపై ప్రాధాన్యత ఉంది. భూ యజమానులకు భూ సరిహద్దుల గుర్తింపు, ప్రభుత్వ, సీలింగ్, ప్రైవేటు, అటవీ భూములు, సేత్వార్ జారీ వంటి వాటి విధుల్లో సర్వేయర్లు కీలకంగా ఉంటారు. భూవివాదాలు, తదితర వాటి చోట సర్వే చేసి స్పష్టమైన హద్దులు గుర్తించాల్సి ఉంటుంది. జిల్లాలో అనేక భూ వివాదాలు ఉన్నాయి. భూ విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు తదితర వాటిపై ప్రైవేటు వ్యక్తులు ఇస్తున్న రిపోర్టులే కీలకంగా మారుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ క్రమంలో కొత్త సర్కారులో వీరిని అలాగే కొనసాగిస్తారా..? లేదా..? అనేది తేలాల్సి ఉంది.

ఇంకా నిర్ణయం తీసుకోలేదు

జిల్లాలో ప్రైవేటు లైసెన్స్ సర్వేయర్లపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. బదిలీపై వచ్చిన రెగ్యులర్ సర్వేయర్లకు మండలాలను కేటాయించాల్సి ఉంది. ప్రైవేటు సర్వేయర్లను కొనసాగించడంపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఆ మేరకు నిర్ణయం తీసుకుంటాం.

వి.శ్రీనివాస్, ఏడీ, సర్వే, ల్యాండ్ రికార్డ్స్

‘స్వచ్ఛదనం–పచ్చదనం’ అభినందనీయం

- ప్రత్యేకాధికారి, రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి
- అధికారులతో సమీక్ష సమావేశం

మంచిర్యాలఅగ్రికల్చర్: స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమం జిల్లాలో విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమని స్వచ్ఛదనం–పచ్చదనం మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల ప్రత్యేక అధికారి, రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ డాక్టర్ కే.ఇలంబర్తి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి జిల్లా అధికారులు, ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇలంబర్తి మాట్లాడుతూ 1049 కిలోమీటర్ల మేర రహదారుల శుభ్రతతోపాటు గుంతలు పూడ్చారని, 597 కిలోమీటర్ల మేర మురుగు కాలువలు శుభ్రం చేశారని, శ్రమదానంలో 7,030 మంది పాల్గొన్నారని తెలిపారు. గ్రామ పంచాయతీల్లో ఫాగింగ్ పూర్తి చేశారని తెలిపారు.

కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా చేపట్టాలని, ఇందుకు అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్‌తో కలిసి హాజీపూర్ మండలం రాపల్లిలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం రాపల్లి, గుడిపేట గ్రామాల్లోని నర్సరీలు, కంపోస్ట్ షెడ్‌లు పరిశీలించి సూచనలు చేశా రు. ఈ కార్యక్రమాల్లో జిల్లా గ్రామీణాభివృద్ధి అధి కారి



కంపోస్ట్ షెడ్‌ను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి ఇలంబర్తి, కలెక్టర్ కుమార్‌దీపక్

కిషన్, జెడ్పీ సీఈఓ గణపతి, డీపీఓ వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీఓ మధుసూదన్, ఎంపీఓ శ్రీనివాసరెడ్డి, ఏపీఓ మల్లయ్య, పంచాయతీ కార్యదర్శులు సాయిరాం, మల్లేశ్ పాల్గొన్నారు. కాగా, హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామంలో డీపీఓ వెంకటేశ్వర్‌రావు పారిశుధ్య కార్యక్రమాలను పర్యవేక్షించారు.

డీటీఓ కార్యాలయం సందర్శన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లా రవాణా శాఖ కార్యాలయాన్ని రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ డాక్టర్ ఇలంబర్తి ఆకస్మికంగా సందర్శించారు. ఆర్టీఓ కార్యాలయ పరిసరాలు, డ్రైవింగ్ ట్రాక్, కార్యాలయం పరిశీలించి ఆవరణలో మొక్క నాటారు. ఆర్టీఓ కార్యాలయం అద్దె భవనం అని చెప్పడంతో సొంత భవనం ఏర్పాటుపై అధికారుల ద్వారా వివరాలు ఆరా తీశారు. స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో రవాణా శాఖ అధికారులు భాగస్వామ్యమై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో డీటీఓ సంతోష్, ఎంవీఐలు కిషోర్‌చంద్రారెడ్డి, రంజిత్‌రెడ్డి, ఏఎంవీఐ ఖాసిం, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏసీబీకి పట్టుబడ్డ ఇరిగేషన్ ఏఈ

- డిపాజిట్ తిరిగి ఇప్పించేందుకు లంచం
- రూ.5వేలు తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు



ఏఈ చేతన్

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఎల్లక్కపేట గ్రామంలో రూ.5వేలు లంచం తీసుకుంటూ ఇరిగేషన్ ఏఈ జాడి చేతన్ ఏసీబీకి పట్టుబడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కిష్టంపేట గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ బొమ్మ చంద్రశేఖర్‌రెడ్డి మిషన్ భగీరథ 4వ ఫేజ్‌లో దుగ్నెపల్లి గ్రామ సమీపంలోని సాలెకుంట పనులు చేపట్టాడు. పనుల కోసం రూ.79,123 డిపాజిట్ చేశాడు. పని పూర్తయిన తర్వాత డిపాజిట్ తిరిగి సదరు కాంట్రాక్టర్‌కు చెల్లించాలి. డిపాజిట్ డబ్బులు చెల్లించాలని ఇరిగేషన్ ఏఈ చేతన్‌ని అడుగగా నాలుగు నెలలుగా తిప్పించుకుంటున్నాడు. రూ.5వేలు లంచం డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు నాలుగు రోజుల క్రితం ఏసీబీని ఆశ్రయించాడు. శుక్రవారం ఎల్లక్కపేటలోని సింగరేణి కార్వర్స్‌లో రూ.5వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వల పన్ని పట్టుకున్నారు. రూ.5వేలు నగదు స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేసి ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నట్లు ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి పేర్కొన్నారు.

నేరస్తులకు శిక్ష పడేలా కృషి చేయాలి

- రామగుండం సీపీ శ్రీనివాసులు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ శ్రీనివాసులు

మంచిర్యాలక్రైం: నేరస్తులకు శిక్ష పడే విధంగా కోర్టు కానిస్టేబుళ్లు, కోర్టు లైజన్ ఆఫీసర్లు కృషి చేయాలని రామగుండం పోలీసు కమిషనర్ ఎం.శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం కమిషనరేట్ కార్యాలయంలో మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల పోలీసుస్టేషన్లలోని కోర్టు కానిస్టేబుళ్లు, లైజన్ ఆఫీసర్లతో కోర్టు విధులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిందితులకు శిక్ష పడితేనే చట్టం, పోలీసు వ్యవస్థపై నమ్మకం కలుగుతుందని అన్నారు. శిక్షలు అమలైతేనే ప్రజల్లో భయం కలిగి నేరాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ(అడ్మిన్) రాజు, ఏసీపీలు రమేష్, జీ.కృష్ణ, వెంకటేశ్వర్లు, రవికుమార్, రాఘవేంద్రరావు, ప్రతాప్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు

- డీఎంహెచ్‌వో డాక్టర్ హరీష్‌రాజ్
- ‘సాక్షి’ ఇంటర్వ్యూ



జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హరీష్‌రాజ్

మంచిర్యాలటౌన్: వర్షాకాలం మొదలైనప్పటి నుంచి జిల్లా వ్యాప్తంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హరీష్‌రాజ్ అన్నారు. ముందస్తు చర్యలతో జిల్లా మెరుగ్గా ఉందని తెలిపారు. ఇటీవల జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి(డీఎంహెచ్‌వో)గా బాధ్యతలు చేపట్టిన ఆయన ‘సాక్షి’ ఇంటర్వ్యూలో మాట్లాడారు.

సీజనల్ వ్యాధుల పరిస్థితి ఎలా ఉంది..?

డీఎంహెచ్‌వో: జిల్లావ్యాప్తంగా కురిసిన వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచి దోమలతో అక్కడక్కడ జ్వరాలు వస్తుండగా, ఆయా ప్రాంతాలను గుర్తించి, దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. ఈ ఏడాది జిల్లావ్యాప్తంగా 19 డెంగీ కేసులు నమోదు కాగా, చికెన్‌గున్యా, మలేరియా కేసులు నమోదు కాలేదు. టైఫాయిడ్, దగ్గు, జ్వరం, జలుబుతో 15 కేసులు నమోదయ్యాయి. ఇంటింటా జ్వర సర్వేను ఏఎన్‌ఎంలు, ఆశాలు చేపడుతున్నారు. 26,886 మందిని పరీక్షించగా, అందులో 183 మందికి జ్వరం వచ్చినట్లు గుర్తించి చికిత్స అందించాం.

దోమల నివారణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు..

డీఎంహెచ్‌వో: జిల్లావ్యాప్తంగా ప్రతీ శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని గ్రామాలు, పట్టణాల్లో చేపడుతున్నాం. నీరు నిల్వ ప్రాంతాలను గుర్తించి తొలగింపజేయడం, లార్వా పెరగకుండా చేయడం చేస్తున్నాం. యాంటీ లార్వాకు సంబంధించి టిమోఫాస్ కెమికల్‌ను స్ప్రే చేస్తున్నాం. నిల్వ నీటిలో ఆయిల్ బాల్స్ వేసి, గంబోజియా ఫిష్‌లను వేసి లార్వా లేకుండా చేస్తున్నాం. వైద్య, ఆరోగ్య సిబ్బంది జ్వర సర్వే కోసం ఇంటింటికి వెళ్లినప్పుడు ఇంట్లో నిల్వ ఉన్న నీటిని తొలగించడంతోపాటు కుటుంబ సభ్యులకు నీటి నిల్వ లేకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో వివరిస్తున్నాం. కూలర్లు, నీటిట్యాంకులు, కొబ్బరిబోండాలు, టైర్లు, ఇంట్లోని పాత వస్తువుల్లో నీరు నిల్వ ఉన్న వాటిని తొలగిస్తున్నాం. ప్రతీ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా చూస్తున్నాం.

మందుల కొరత ఏమైనా ఉందా..?

డీఎంహెచ్‌వో: సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉండడంతో ఆదిలాబాద్‌లో ఉన్న సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి మూడు నెలలకు సరిపడా మందులు తెప్పించి అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో సిద్ధంగా ఉంచాం. సీజనల్ వ్యాధులు ఏవి ప్రబలినా వెంటనే చికిత్స అందించి, అవసరమైన మందులు అందిస్తాం. కుక్కకాటు, పాముకాటు కేసులు వస్తుండడంతో వాటికి సరిపడా మందులు అందుబాటులో ఉంచాం. ఫ్లూయిడ్స్, సిరప్‌లు, సెలైన్, ఓఆర్‌ఎస్‌లను సిద్ధం చేశాం.

వైద్యుల కొరతను ఎలా అధిగమిస్తున్నారు..

డీఎంహెచ్‌వో: ఇటీవల జరిగిన బదిలీల్లో జిల్లాకు చెందిన వైద్యులు ఇతర చోటుకు వెళ్లలేదు. జిల్లాలోనే మరో ప్రభుత్వ ఆసుపత్రికి బదిలీ అయ్యారు. 24 గంటల ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రుల్లో ఇద్దరు వైద్యులు ఉన్నచోట ఒక్కరే ఉండడంతో, జిల్లావ్యాప్తంగా ఉన్న 100 ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కేంద్రాల వైద్యులతో ఆ కొరతను తీరుస్తున్నాం. ఆర్‌బీఎస్‌కేలో పనిచేస్తున్న వైద్యుల సేవలను తీసుకుని, సీజనల్ వ్యాధుల సమయంలో వైద్యుల కొరత లేకుండా చేస్తున్నాం. జిల్లాలో ఐదుగురు ప్రోగ్రాం ఆఫీసర్లు ఉండగా, వారు నోడల్ ఆఫీసర్లుగా పనిచేస్తూ సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి నివారణ కోసం కృషి చేస్తారు.

ప్రజలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి..

డీఎంహెచ్‌వో: ప్రజలు నీరు రోజుల తరబడి నిల్వ ఉండకుండా చూడాలి. దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలి. శుభ్రంగా ఉండే నీటినే తాగాలి. తాగునీటి నిల్వ ఉంటే క్లోరినేషన్ చేసుకోవడం, పైప్‌లైన్ లీకేజీలు ఉంటే వెంటనే సరిచేయడం అధికారులు చేపట్టాలి. పనుల నిమిత్తం బయటకు వెళ్లేవారు ఏ నీరు దొరికితే దానిని తాగవద్దు. తప్పనిసరైతే ఆ నీటిని వేడి చేసి చల్లార్చి తాగాలి. బయటి ఆహారాన్ని వీలైనంత వరకు తగ్గించాలి. ఇంట్లోనే వండుకున్న వేడి ఆహారాన్ని తీసుకోవాలి. పానీపూరి లాంటి వాటికి సీజనల్ సమయంలో దూరంగా ఉండాలి. అపరిశుభ్రంగా ఉండే చోట వండిన ఆహారాన్ని తీసుకోకపోవడం మంచిది. వర్షాకాలం మొత్తం తాగునీటిని తప్పనిసరిగా వేడి చేసి చల్లార్చిన తరువాతనే తాగాలి.

ఘనంగా ఆదివాసీ దినోత్సవం



ర్యాలీని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ మోతీలాల్, డీటీడీవో గంగారాం



చెన్నూర్‌లో సంప్రదాయ నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే వివేక్, మహిళలు

చెన్నూర్/పాతమంచిర్యాల: జిల్లాలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చెన్నూర్‌లో ఆదివాసీ సంఘం నాయకులు, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో పెద్ద చెరువు కట్ట నుంచి హబీబ్ ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ సాగింది. గిరిజన సంప్రదాయం వెల్లివిరిసేలా డప్పు చప్పులు, గిరిజన మహిళల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ర్యాలీలో ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి పాల్గొని గిరిజన మహిళా కళాకారులతో కలిసి నృత్యం చేశారు. మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, ఆదివాసీ సంఘం నాయకులు జేక శేఖర్, దుగ్నె జయిలు, చెడెంకి మాంతయ్య, బొయిని నగేశ్, బండి రమేశ్, కొలకాని రాములు, రొడ్డ శ్రీనివాస్ దైనెని రవి, ఐఎఫ్‌టీయూ, పీవోడబ్ల్యూ సంఘాల నాయకులు పాల్గొన్నారు. మంచిర్యాలలోని వైశ్యభవన్‌లో ఆదివాసీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఐబీ చౌరస్తా నుంచి వైశ్యభవన్ వరకు గిరిజన సంప్రదాయ నృత్యాలతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్, డీటీడీవో మడావి గంగారాం జెండా ఊపి ప్రారంభించారు. కోయతెగకు చెందిన మహిళలు సమ్మక్క–సారలమ్మ బోనాలు, నాయకపోడ్‌తెగకు చెందిన మహిళలు లక్ష్మీదేవర బోనాలతో సభా ప్రాంగణానికి ఊరేగింపుగా వచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ దినోత్సవ కార్యనిర్వాహక కమిటీ అధ్యక్షుడు కుర్సెంగ వెంకటేష్, పర్థాన్, తోటి, గోండు, 9 తెగలకు చెందిన నాయకులు, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

‘ప్రపంచ వ్యాప్తంగా ఆదివాసీ దినోత్సవం’



ర్యాలీలో కోట్నాక తిరుపతి, నాయకులు

దండేపల్లి: గిరిజన సంస్కృతి, గౌరవాన్ని కాపాడుకునేందుకు, ప్రోత్సహించేందుకు ఆదివాసీలు ప్రతియేటా ఆగస్టు 9న ప్రపంచ వ్యాప్తంగా ఆదివాసీ గిరిజన దినోత్సవ వేడుకలు పండగలా నిర్వహిస్తున్నారని రాష్ట్ర గిరిజన సహకార చైర్మన్ కోట్నాక తిరుపతి అన్నారు. దండేపల్లి మండలంలో శుక్రవారం నిర్వహించిన ఆదివాసీ గిరిజన దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. తాళ్లపేటలో కుమురంభీం విగ్రహానికి పూలమాల వేశారు. అక్కడి నుంచి దండేపల్లి మండల కేంద్రం వరకు నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. అంగడి బజార్ ఆవరణలో జెండా ఎగురవేశారు. అనంతరం పద్మశాలి భవన్‌లో గిరిజనులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడారు. ఆదివాసీ దినోత్సవం రోజున ప్రభుత్వం సెలవు ప్రకటించాలని అన్నారు. గుడిరేవు ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన ఆదివాసీ దినోత్సవ వేడుకల్లోనూ తిరుపతి పాల్గొన్నారు. కార్యక్రమాల్లో ఆదివాసీ నాయకులు రాంపటేల్, దాముపటేల్, జంగు, లింగరావ్, శ్రీనివాస్, జలపతి, ఆదివాసీ గోండ్, నాయక్‌పోడ్ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు

మంచిర్యాలఅగ్రికల్చర్: వినియోగదారులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరాతోపాటు విద్యుత్ శాఖ అవినీతి రహితంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు జిల్లా విద్యుత్ శాఖ ఎస్‌ఈ ఎస్.శ్రావణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయంలో ‘లంచం ఇవ్వకండి.. మాకు సమాచారం ఇవ్వండి, లంచం ఇవ్వడం, తీసుకోవడం చట్టరీత్యా నేరం’ అనే వాల్ పోస్టర్లను విడుదల చేశారు. అవినీతి నిరోధానికి టోల్‌ఫ్రీ నంబరు 1064, 92810 33233లో సమాచారం ఇవ్వవచ్చని తెలిపారు. డీఈ ఖైజర్, ఏడీలు తిరుపతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

‘ప్రభుత్వ వైద్యంపై నమ్మకం పెంచాలి’



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేక్, కలెక్టర్ కుమార్ దీపక్

జైపూర్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు చిత్తశుద్ధితో పని చేయాలని, ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో నమ్మకం పెంచాలని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. మండలంలోని కుందారంలో రూ.1.50కోట్లతో నిర్మించిన ఆస్పత్రి భవనాన్ని కలెక్టర్ కుమార్ దీపక్, డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్నిరకాల సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ అవసరం మేరకు ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బందిని తాత్కాలిక పద్ధతుల్లో నియమిస్తామని తెలిపారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో అధికారులు, నాయకులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు అనిల్‌కుమార్, ఫయాజ్ ఖాన్, వైద్యాధికారి శ్రావ్య, మండల ప్రత్యేక అధికారి గణపతి, తహసీల్దార్ వనజారెడ్డి, ఎంపీడీవో సత్యనారాయణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఏడుగురు పేకాట రాయుళ్లు అరెస్ట్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని అశోక్ రోడ్‌లోగల ఓ ఇంట్లో పేకాడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి ఏడుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసి స్థానిక పోలీసులకు అప్పగించారు. కాగా, వారి నుంచి రూ.6,500 నగదు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు స్థానిక సీఐ బన్సిలాల్ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత


పట్టుకున్న రేషన్‌బియ్యం

నెన్నెల: మండలంలోని కుశ్నపల్లిలో గంగిరెడ్డి తిరుపతిరెడ్డి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 12 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. పక్కా సమాచారంతో రెవెన్యూ అధికారులతో కలిసి దాడి చేసినట్లు పేర్కొన్నారు. బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రైతుల పొలాల్లోకి 'కడెం' నీరు


పంట పొలాల్లోకి చేరుతున్న నీరు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం రాపల్లి శివారులోని రైతుల పంట పొలాలు కడెం కాలువ నీటి వరదతో నిండిపోయాయి. ఇటీవల కడెం ప్రాజెక్ట్ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేసి కాలువల్లోకి వదిలారు. ఇలా కాలువల ద్వారా చివరి ఆయకట్టు వరకు వస్తున్న నీటితో రాపల్లిలోని చెరువు కుంటను నింపాలని అధికారులు, ప్రజాప్రతినిధులు భావించారు. అయితే కడెం ప్రాజెక్ట్ బీ–23 కాలువ ద్వారా నీటి ప్రవాహం పెరిగి సమీపంలోని రైతుల పంట పొలాల్లోకి చేరి పొలాలు నీటమునిగాయి. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

LAND FOR SALE

1.65 acres of Land on Sale at Neppalli, A.P.2KM from Davuluru toll, 600 m from NH 65,4KM from Kankipadu ✆ 83099 87010 [B-773801]

SERVICES

వ్యవసాయ, వ్యాపార, ప్రాపర్టీ మరియు వ్యక్తిగత కోసం అతి తక్కువ వడ్డీతో ఋణాలు, సిబిల్ అవసరం లేదు NPA కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. సెల్: 9501065342 [T-270]

WANTED

త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీతం 18K ఫోన్: 9160900024, 9640400073 [H-796264]

www.sakshi.com


గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462

పవర్‌ప్లాంట్‌కు దిక్కెవరు?

- ఆరు నెలలుగా ఈడీ పోస్టు ఖాళీ
- వోఅండ్ఎం చీఫ్‌కు అనారోగ్యం
- కీలక పోస్టుల నియామకంపై అశ్రద్ధ
- సా.. గుతున్న ఓవరాలింగ్ పనులు
- టెండర్‌దశలో 800మెగావాట్ల ప్లాంట్


జైపూర్ పవర్ ప్లాంట్

జైపూర్: పవర్‌ప్లాంట్ అనేది అనేక యంత్రాల సమూహం.. బొగ్గును మండించి నీటిని ఆవిరిగా మార్చేందుకు అనేక యంత్రాలు.. వాటిని నడిపించేందుకు ఉద్యోగులు, కార్మికులు అనునిత్యం శ్రమిస్తూనే ఉంటారు. ఎన్నో విభాగాలు.. మరెన్నో పరికరాలతో ప్లాంట్ ఒక సముద్రం లాంటిది. ఇంతటి పవర్ ప్లాంట్‌ను నడిపించే వాటిలో ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ డిపార్ట్‌మెంట్ ఒకటి కాగా, మరొకటి అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్. అన్ని విభాగాలను సమన్వయం చేస్తూ వారి పరిధిలో పని చేయాల్సి ఉంటుంది. 2017నుంచి ప్లాంట్‌లో విద్యుదుత్పత్తి ప్రక్రియ ప్రారంభమైనా క్షేత్రస్థాయిలో సరైన సిస్టం ఏర్పాటు చేయకపోవడం, కీలకమైన పోస్టుల్లో సింగరేణి సంస్థ అధికారులను స్వతహాగా నియమించకపోవడంతో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఇక ప్లాంట్‌ను నడిపించే కీలకమైన వోఅండ్ఎం, ఈడీ పోస్టుల్లో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ఎన్టీపీసీ రిటైర్డ్ అధికారులను నియమించారు. ఆరు నెలల కిందట ఈడీ పోస్టులో కొనసాగిన సంజయ్‌కుమార్ సూర్‌ను తొలగించారు. వోఅండ్ఎం చీఫ్‌గా కొనసాగుతున్న జెన్‌సింగ్ వయస్సు పైబడటం ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ ఆయన దేనిపై స్పందించకపోవడం ప్లాంట్‌కు పెద్ద దిక్కు లేకుండాపోతోంది.

డైరెక్టర్ స్థాయిలోనే అధికారాలు

ఇంతటి పవర్‌ప్లాంట్‌లో ఎలాంటి నిధులు ఖర్చు చేయాలన్నా డైరెక్టర్ స్థాయిలో అనుమతులు తీసుకోవాల్సిందే. అన్ని ఏరియాలతో పాటే డైరెక్టర్‌కు పవర్ ప్లాంట్ అప్పగించారు. ఆయన ఉండే బిజీ షెడ్యూల్‌తో ప్లాంట్‌పై శ్రద్ధ పెట్టి కొత్త ప్రణాళికలు గాని, అభివృద్ధి అంశాలు పరిశీలించే అవకాశం తక్కువ. 800 మెగావాట్ల కొత్త ప్లాంట్‌కు ఇప్పటికే ఒకసారి టెండర్లు కాగా, మళ్లీ రీటెండర్లు పిలిచిన సంగతి తెలిసిందే. ఎన్టీపీసీలో ఈడీ స్థాయిలో అధికారాలు ఇస్తే కొత్త ప్రణాళికతో పాటు ప్లాంట్ అభివృద్ధి, నిధుల ఖర్చుకు ఎలాంటి ఇబ్బందులుండవు.

దేశంలోనే అగ్రగామిగా..

జైపూర్ మండలం కేంద్రంలో గల 1200మెగా వాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం నుంచి నిరంతరం విద్యుత్ ఉత్పత్తి సాధిస్తూ దేశస్థాయిలోనే అగ్రగామిగా నిలుస్తూ ఎన్నో అవార్డులను సాధించింది. పవర్ ప్లాంట్‌కు వోఅండ్ఎం (ఆపరేషన్స్ అండ్ మెయింటినెన్స్), బీవోపీ (బ్యాలెన్స్ ఆఫ్ ప్లాంట్) ఒక కన్ను అయితే.. అడ్మినిస్ట్రేషన్ మరో కన్ను లాంటిది. వోఅండ్ఎం చీఫ్ ప్రధానంగా విద్యుదుత్పత్తి, నిర్వహణ ప్రకియపైనే దృష్టి పెడతారు. ఇందుకు కీలకమైన బాయిలర్‌తో పాటు సీహెచ్‌పీ, కూలింగ్ టవర్లు, రిజర్వాయిర్ లాంటి ఆపరేషన్స్ డిపార్ట్‌మెంట్ల ద్వారా సిస్టం డెస్కల్ ఆపరేషన్ ద్వారా నిరంతరం విద్యుదుత్పత్తి సాధిస్తారు. అడ్మినిస్ట్రేషన్ విభాగం మరో కీలకమైన డిపార్ట్‌మెంట్‌గా పని చేస్తుంది. వోఅండ్ఎం డిపార్ట్‌మెంట్‌ను సమన్వయం చేయడంతో పాటు సింగరేణి జీఎం, డీజీఎం, ఏజీఎంల శాఖను నడిపించేందుకు ఈడీ (ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్) స్థాయిలో అధికారులను ఇస్తూ అడ్మినిస్ట్రేషన్ విభాగం పని చేస్తుంది. అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ఈడీ పరిధిలోనే ఎన్టీపీసీ అధికారులు పని చేస్తారు. పవర్‌ప్లాంట్ భవిష్యత్ ప్రణాళిక, అభివృద్ధి, బడ్జెట్ ఖర్చులు, నిధుల సమీకరణ, బొగ్గు, నీళ్లు, కొత్త ప్లాంట్ నిర్మాణ ప్రణాళికలు లాంటి కీలక బాధ్యతలు నిర్వర్తిస్తారు. కాగా, ఇంతటి కీలకమైన శాఖల్లో కొనసాగుతున్న ఇద్దరు అధికారులను సింగరేణి సంస్థ అవుట్ సోర్సింగ్ పద్ధతిలో నియమించుకుని ఏళ్లు గడుస్తున్నప్పటికీ శాశ్వతంగా సింగరేణి సంస్థలో పని చేస్తున్న అనుభవం కలిగిన అధికారులకు అవకాశం కల్పించకపోవడం పవర్ ప్లాంట్ జీవిత కాలానికి ముప్పువాటిల్లే ప్రమాదం లేకపోలేదు.

ప్రైవేట్ కంపెనీ చేతుల్లోనే ప్లాంట్

పర్మినెంట్ ఉద్యోగులను నియమించుకుని ప్లాంట్‌ను సింగరేణి సంస్థ నిర్వహించాల్సి ఉంది. కానీ.. ప్రైవేట్ కంపెనీకి ప్లాంట్‌ను అప్పగించడంపై అనేక విమర్శలు వస్తున్నాయి. సింగరేణి సంస్థకు రూ.వేల కోట్ల లాభాలు పవర్‌ప్లాంట్ నుంచి వస్తుండగా భవిష్యత్‌లో సింగరేణి కార్మికులు, సంస్థకు మణిహారంగా పవర్ ప్లాంట్ నిలువనుంది. 50ఏళ్ల జీవితకాలం కలిగిన ప్లాంట్‌ను ప్రైవేట్ కంపెనీకి అప్పగించడంతో దాని జీవితకాలం తగ్గే అవకాశముంటుందని, ఇప్పుడు పని చేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేసి సింగరేణి సంస్థనే ప్లాంట్‌ను నిర్వహించాలని పెద్దఎత్తున డిమాండ్ వస్తోంది.

నాలుగు ఇసుక లారీల పట్టివేత


లారీలను మైనింగ్ సిబ్బందికి అప్పగిస్తున్న సీఐ

చెన్నూర్: చెన్నూర్ బతుకమ్మ వాగు సమీపంలో శుక్రవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా నాలుగు ఇసుక లారీలు పట్టుబడినట్లు సీఐ రవీందర్ తెలిపారు. సీఐ మాట్లాడుతూ.. రెండు లారీలు కోటపల్లి మండలం కొల్లూరు ఇసుక క్వారీ నుంచి వస్తుండగా, మరో రెండు లారీలు జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లా మహదేవపూర్ మండలం పలుగుల క్వారీ నుంచి వస్తున్నాయని పేర్కొన్నారు. రెండు లారీల్లో నాలుగు నుంచి ఐదు టన్నులు ఇసుక అధికంగా తరలిస్తుండగా, మరో రెండు లారీల్లో వేబిల్లులు లేకుండా ఇసుక తరలిస్తున్నారని తెలిపారు. తదుపరి విచారణ కోసం పట్టుకున్న నాలుగు లారీలను మైనింగ్ అధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాధ్యతల స్వీకరణ

శ్రీరాంపూర్: ఏరియా ఎస్వోటూ జీఎంగా సత్యనారాయణ శుక్రవారం జీఎం కార్యాలయంలోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఏరియా ఇన్‌చార్జి జీఎం టీ శ్రీనివాస్ సత్యనారాయణను శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు. డీజీఎం పర్సనల్ అరవిందరావు, ఏరియా రక్షణాధికారి శ్రీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

లాభాల వాటా ప్రకటించాలి


వినతిపత్రం ఇస్తున్న బీఎంఎస్ నాయకులు

శ్రీరాంపూర్: సింగరేణి గత ఆర్థిక సంవత్సరం సాధించిన వాస్తవ లాభాలను వెంటనే ప్రకటించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య యాజమాన్యాన్ని కోరారు. శుక్రవారం ఆయన కొత్తగూడెంలో సింగరేణి డైరెక్టర్ (పా) ఎన్వీకే శ్రీనివాసులును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాస్తవ లాభాలను ప్రకటించి అందులోంచి 40 శాతం వాటాను కార్మికులకు చెల్లించాలని కోరారు. కార్మికులు ఎంతో కష్టపడి 70.12 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసి రికార్డు సృష్టించారని పేర్కొన్నారు. కార్మికుల కష్టాన్ని గుర్తించి వాటా పంపిణీ చేయాలని కోరారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి సారంగపాణి, నాయకులు తాండ్ర మొగిలి, బండారి శ్రీనివాస్, మొగిలిపాక రవి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి సులభ్ కార్మికుల ధర్నా వాయిదా


బెల్లంపల్లిరూరల్: మాట్లాడుతున్న శ్రీనివాస్

బెల్లంపల్లిరూరల్: సమస్యల పరిష్కారం కోసం సింగరేణి సులభ్ కార్మికులు ఈ నెల 10వ తేదీన హైదరాబాద్‌లోని సింగరేణి సీ అండ్ ఎండీ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నాను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ఇఫ్టూ సింగరేణి వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ ప్రధాన కార్యదర్శి టీ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం బెల్లంపల్లిలోని ఇఫ్టూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యల పరిష్కారంపై ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం సింగరేణి ఉన్నతాధికారులతో జరిపిన చర్చలు సఫలమయ్యాయని తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఒప్పందంతో సులభ్ కార్మికులకు రూ.30 లక్షల ప్రమాద బీమా, ఈఎఫ్‌ఐ, ఈపీఎఫ్ కూడా అమలు చేస్తామని అధికారులు హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. దీంతో ధర్నాను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నామని తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం సానుకూలంగా స్పందించిన సింగరేణి ఉన్నతాధికారులు శ్రీనివాస్, సూర్యనారాయణకు ధన్యవాదాలు తెలిపారు. నాయకులు, సులభ్ కార్మికులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్: సింగరేణిలో పని చేస్తున్న సులభ్ కాంప్లెక్స్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10న తలపెట్టిన సీఎండీ కార్యాలయ ఎదుట ధర్నాను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డీ బ్రహ్మానందం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీనిపై శుక్రవారం కొత్తగూడెంలో కంపెనీ డైరెక్టర్ (పా) ఇతర అధికారులతో తమ డిమాండ్లపై చర్చలు జరిగాయని పేర్కొన్నారు. రూ.30 లక్షల ప్రమాద భీమా, బోనస్ ఇతర డిమాండ్ల పరిష్కారానికి యాజమాన్యం అంగీకరించడంతో ధర్నా వాయిదా వేసినట్లు తెలిపారు.

పర్యావరణాన్ని కాపాడాలి


మొక్కలు నాటుతున్న ఇన్‌చార్జి జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్: పర్యావరణాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాలని శ్రీరాంపూర్ ఇన్‌చార్జి జీఎం టీ శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శ్రీరాంపూర్ స్టోర్స్, టింబర్ యార్డ్‌ల్లో సింగరేణి ఆధ్వర్యంలో వనమహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ విధిగా మూడు మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. పర్యావరణాన్ని కాపాడితేనే భవిష్యత్ తరాలు మనుగడ సాధిస్తాయని పేర్కొన్నారు. సింగరేణి యాజమాన్యం పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యమిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో ఎస్వోటూ జీఎం ఎన్ సత్యనారాయణ, డీజీఎం పర్సనల్ అరవిందరావు, అధికారుల సంఘం ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్, ఏరియా స్టోర్స్ డీజీఎం యాదయ్య, ఏరియా రక్షణాధికారి శ్రీధర్‌రావు, ఫారెస్ట్ అధికారి రమణారెడ్డి, ఎన్విరాన్మెంట్ అధికారి హనుమాన్‌గౌడ్, పిట్ సెక్రటరీ వంగ కుమార్‌స్వామి, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

జ్వరంతో నిండు గర్భిణి మృతి


పార్వతి (ఫైల్)

కాసిపేట: మండలంలోని రేగులగూడకు చెందిన నిండు గర్భిణి డెంగీ జ్వరంతో మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రేగులగూడకు చెందిన గేడం కిరణ్ భార్య పార్వతి (22) నిండు గర్భిణి. ఈనెల 5న తీవ్రమైన తలనొప్పి, వాంతులు కావడంతో కాసిపేట పీహెచ్‌సీకి తీసుకువెళ్లి చికిత్స చేయించి ఇంటికి తీసుకువెళ్లారు. ఇంటికి వెళ్లాక నొప్పి మళ్లీ తీవ్రం కావడంతో వైద్యసిబ్బంది సూచన మేరకు 6వ తేదీ తెల్లవారుజామున మంచిర్యాల మాతాశిశు కేంద్రానికి తీసుకువెళ్లారు. అక్కడ అడ్మిట్ చేసుకుని చికిత్స చేస్తుండగా 8వ తేదీ సాయంత్రం ఫిట్స్ వచ్చి పరిస్థితి విషమించింది. డెంగీ జ్వరం ఉందని హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తీసుకు వెళ్లాల్సిందిగా వైద్యులు సూచించడంతో ఆమె కుటుంబీకులు కరీంనగర్ రెఫర్ చేయాలని కోరారు. దీంతో వైద్యులు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఇద్దరిలో ఎవరైనా బతుకుతారు.. అనే ఆశతో కరీంనగర్‌లోని పలు ప్రైవేట్ ఆస్పత్రులు తిరిగినా ఎవరూ అడ్మిట్ చేసుకోలేదు. తెల్లవారుజామున 4గంటలకు ఎంజీఎంకు చేరుకోగా అక్కడ పరిశీలించి గుండె కొట్టుకోవడం నిలిచి మృతిచెందినట్లు తెలిపారు. బిడ్డ కూడా అప్పటికే మృతిచెందినట్లు పేర్కొన్నారు. మృతురాలికి రెండేళ్ల నిండిన కుమారుడు జయదేవ్ ఉన్నాడు.

వైద్యుల నిర్లక్ష్యంతోనే..

జ్వరంతో ఫిట్స్ వచ్చి పరిస్థితి తీవ్రతరం అయ్యేదాకా వైద్యులు ఏమీ చెప్పలేదని, పార్వతి మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యులు ఆరోపించారు. వైద్యుల నిర్లక్ష్యం ఇద్దరి ప్రాణాలను బలిగొందని వాపోయారు. వైద్యులు మూడురోజుల్లో సమస్య గుర్తించి చికిత్స చేసినా లేదా రెఫర్ చేసినా బతికే అవకాశం ఉండేదని ఆవేదన వ్యక్తం చేశారు.

రైతులను మోసం చేసిన వ్యక్తిపై కేసు

కోటపల్లి: మండలంలోని రాంపూర్, కొల్లూర్, జనగామ గ్రామాలకు చెందిన 21మంది రైతులు 2023లో దేవులపల్లి రమేశ్ అనే వ్యక్తికి రూ.47లక్షల విలువ చేసే మిర్చిని అమ్మగా అతడు ముందుగా కొంత నగదు చెల్లించాడు. మిగతా డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేశాడు. దీంతో కోటపల్లి పోలీస్‌స్టేషన్‌లో రైతులు కవ్వాల శ్రీనివాస్, హనుమంతు, సంపత్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై రాజేందర్ విచారణ చేపట్టి రమేశ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

గంజాయి పట్టివేత


గంజాయి, నిందితుడితో పోలీసులు

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని నజ్రూల్‌నగర్ విలేజ్ నంబర్–3 గ్రామానికి చెందిన మిథున్ మండల్ ఇంట్లో శుక్రవారం 50 గ్రాముల గంజాయి లభ్యమైందని టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపారు. మిథున్ మండల్ గంజాయి విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు తనిఖీ చేసి రూ.5వేల విలువైన గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఎవరైనా అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే 87126 70505 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. తనిఖీల్లో ఎస్సై వెంకటేశ్, సిబ్బంది మధు, రమేశ్ పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడిలో ఒకరికి తీవ్రగాయాలు

దండేపల్లి: మండల కేంద్రానికి చెందిన ఎస్కే షకీల్‌పై గురువారం రాత్రి వీధికుక్కలు దాడి చేశాయి. షకీల్ స్థానిక మసీదువాడలో దారివెంట నడుచుకుంటూ వస్తుండగా ఒక్కసారిగా కుక్క అతడిపై దాడిచేసి కాలిని కొరికింది. దీంతో తీవ్ర రక్తస్రావం కావడంతో స్థానికులు వెంటనే అతడిని దండేపల్లి పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం ఆస్పత్రి సిబ్బంది మంచిర్యాలకు రెఫర్ చేశారు.

నీలుగాయిని హతమార్చిన ఘటనలో పదిమందిపై కేసు


ఇద్దరిని జైలుకు తీసుకెళ్తున్న అటవీ సిబ్బంది

దండేపల్లి: మండలంలోని పాతమామిడిపల్లి సమీప అడవుల్లో ఇటీవల నీలుగాయిని హతమార్చిన ఘటనలో పదిమందిపై కేసు నమోదు చేసినట్లు తాళ్లపేట ఎఫ్‌ఆర్వో సుష్మారావు తెలిపారు. నీలుగాయిని వేటాడి, మాంసం విక్రయించిన ఘటనపై తమ సిబ్బంది తనిఖీ చేయగా, మండలంలోని కర్నపేటకు చెందిన మారినేని సామ్యూల్, రాజన్న ఇళ్లల్లో మాంసం లభించిందని పేర్కొన్నారు. వారిని విచారించగా మరి కొంతమంది పేర్లు చెప్పారని తెలిపారు. ప్రస్తుతం ఇద్దరిని అదుపులోకి తీసుకోగా, మిగతా వారు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. అదుపులోకి తీసుకున్న ఇద్దరిని శుక్రవారం లక్సెట్టిపేట సబ్‌జైలుకు తరలించామని వెల్లడించారు.

పాయల్ జోష్.. సంయుక్త సందడి


సినీతారలను చూసేందుకు తరలివచ్చిన జనం


సీఎంఆర్ షాపింగ్ మాల్‌లో చీరలను తిలకిస్తూ చూపిస్తున్న హీరోయిన్లు రాజ్‌పుత్‌పాయల్, సంయుక్తా మీనన్

- కరీంనగర్‌లో సీఎంఆర్ షాపింగ్ మాల్‌ను ప్రారంభించిన సినీతారలు


షోరూంను ప్రారంభిస్తున్న డాక్టర్ సూర్య నారాయణరెడ్డి దంపతులు, లక్ష్మీనర్సింహారావు

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్‌లో సినీతారలు సందడి చేశారు. ప్రముఖ టాలీవుడ్ హీరోయిన్లు పాయల్ రాజ్‌పుత్, సంయుక్త మీనన్ నగరంలో నూతనంగా ఏర్పాటుచేసిన సీఎంఆర్ షాపింగ్‌మాల్‌ను ప్రారంభించారు. అంతకుముందు చల్మెడ వైద్య విజ్ఞాన సంస్థ చైర్మన్ చలిమెడ లక్ష్మీనరసింహారావు, ప్రముఖ వైద్యుడు సూర్యనారాయణరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేశారు. కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన మాల్ 32వదని, త్వరలోనే నిజామాబాద్, మేడ్చల్‌లోనూ ప్రారంభిస్తామని సీఎంఆర్ ఎండీ మావూరి వెంకటరమణ తెలిపారు. సినీతారలను చూసేందుకు పెద్దఎత్తున అభిమానులు తరలివచ్చారు. వారితో హీరోయిన్లు సెల్ఫీలు దిగారు. అనంతరం మాల్‌లో పలు వస్త్రాలను పరిశీలించి, హర్షం వ్యక్తం చేశారు.

మాదారంలో ఇల్లు దగ్ధం


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై, నాయకులు

తాండూర్: మండలంలోని మాదారం టౌన్‌షిప్‌లో రాజీవ్‌నగర్‌లో ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధమైంది. మాదారం ఎస్సై సౌజన్య, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... రాదండి లక్ష్మి అనే వృద్ధురాలు తనింట్లో నివాసముంటోంది. శుక్రవారం ఉదయం పనులు ముగించుకుని ఆమె బయటకు వెళ్లిన సమయంలో ఒక్కసారిగా ఇంట్లోంచి మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలించలేదు. మంటలు పెద్ద ఎత్తున చెలరేగడంతో ఇంట్లోని గ్యాస్ సిలిండర్ పేలింది. ఆ సమయంలో ఇంటి సమీపాన ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. విషయం తెలుసుకున్న బెల్లంపల్లి ఫైర్‌స్టేషన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు. ఇల్లుతోపాటు బీరువాలో దాచుకున్న రూ.లక్ష నగదు, నాలుగు తులాల బంగారం, ఇతర వస్తువులు మంటల్లో పూర్తిగా కాలిపోగా వృద్ధురాలు రోదించిన తీరు పలువురిని కలిచివేసింది. తనను ఆదుకోవాలని వేడుకుంది. ఎస్సై, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సూరం రవీందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సౌందర్య, స్థానిక నాయకులు, అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితురాలికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బెదిరింపు వసూళ్లకు పాల్పడుతున్న నకిలీ విలేకరి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ ప్రకాశ్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలో కొంతమందిని బెదిరించి వసూళ్లకు పాల్పడుతున్న నకిలీ విలేకరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు స్థానిక ఏసీపీ ప్రకాశ్ తెలిపారు. శుక్రవారం ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జైపూర్‌కు చెందిన గడ్డం రమేశ్ ఎన్టీపీసీ పవర్ ప్లాంట్‌లో లేబర్ వర్క్ చేసుకుంటూ జీవనం సాగించేవాడు. గత నెల 24మంచిర్యాలకు చెందిన ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరు సమ్మయ్యకు ఫోన్ చేసి 'నేను టీవీ రిపోర్టర్‌ను.. నీ రహస్యాలన్నీ నా దగ్గర ఉన్నాయి. టీవీలో ప్రసారం చేయబోతున్నా.. అర్జెంట్‌గా రూ.2వేలు ఫోన్ పే చేయి' అని బెదిరించాడు. పలుసార్లు సమ్మయ్యకు ఫోన్ చేసి బెదిరించగా ఈ నెల 7న మంచిర్యాల పోలీస్‌స్టేషన్‌లో రమేశ్‌పై ఫిర్యాదు చేశాడు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు రమేశ్‌ను అరెస్ట్ చేసి విచారించగా నకిలీ విలేకరి అని తేలింది. దీంతో అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. స్థానిక సీఐ బన్సీలాల్, ఎస్సై సనత్‌కుమార్ ఉన్నారు.

లాభాల వాటా చెల్లించాలి

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికులకు కంపెనీ గత సంవత్సరం సాధించిన లాభాల నుంచి 30 శాతం వాటా చెల్లించాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ సీతారామయ్య యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్కే న్యూటెక్ గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కార్మికులనుద్దేశించి మాట్లాడారు. గత సంవత్సరం కంపెనీ సాధించిన లాభాలు ముందుగా ప్రకటించి ఈ వాటా చెల్లించాలన్నారు. సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం రూ.29వేల కోట్ల బకాయిలుందని, వెంటనే వీటిని చెల్లించాలని డిమాండ్ చేశారు. యూనియన్ శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా, నాయకులు సంపత్, పిట్ సెక్రటరీ లక్ష్మణ్, అఫ్రోజ్ ఖాన్, సకినాల నర్సయ్య, చంద్రమౌళి, వెంకటేశం పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

జన్నారం: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై రైతు మృతి చెందాడు. ఎస్సై రాజవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ధర్మారం గ్రామం రూప్‌నాయక్ తండాకు చెందిన భూక్య సక్కులాల్ (60) గురువారం రాత్రి వర్షం కురిసే అవకాశముండటంతో ఇంటి వెనకాల బావికి అమర్చిన మోటర్‌పై కవర్ కప్పేందుకు వెళ్లాడు. ప్లాస్టిక్ ట్యూబ్‌ను మోటర్‌పై కప్పే క్రమంలో ప్రమాదశాత్తు కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి భార్య యమున ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.